పాటలతో మమేకమై బతికిన నేల తెలంగాణ. వందల సంవత్సరాల క్రితమే తెలంగాణలో తుమ్మెద పదాలు, వలలో, ఉయ్యాల, ఎన్నీయల్లో, సందమామయ్యలు అని జనం పదాలు కైగట్టుకొని పాడుకున్నరు. దుఃఖమో, సంబురమో, సావో, పుట్టుకో, పండుగో, పబ్బమో.. అది ఏదన్న గాని పాట ఉండాలె. ప్రపంచ పోరాటాల చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం దక్కించుకున్న తెలంగాణ సాయుధ పోరాట కాలంలో బాంచెన్ బతుకుల్ని పాట పోరాటంలోకి నడిపించింది. ఆనాటి వెట్టికి వ్యతిరేకంగా సుద్దాల హనుమంతు.. ''పల్లెటూరి పిల్లగాడా'' పాటగట్టిండు. బండి యాదగిరి ''బండెనుక బండిగట్టి''తో 'బాంచెన్ దొర' అంటూ బతికే జనాన్ని ఎర్రదండులోకి నడిపించిండు. చివరికి నిజాం రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. సైనిక, పౌర ప్రభుత్వాల ఏర్పాటు అనంతరం ఫజల్ అలీ కమిషన్ నివేదికను లెక్కచేయకుండా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా తెలంగాణని సీమాంధ్రతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిండ్రు. నవంబర్ 1 చరిత్రలో తెలంగాణ విద్రోహ దినంగా మిగిలిపోయింది. తొలి తెలంగాణ ఉద్యమానికి ఏడాది ముందే ''తెలంగాణ పల్లె పాటలు'' అనే సంకలనం వచ్చింది. ఆ తర్వాత నీలగిరి పాటలు, సాయుధ పోరాట పాటలు, చెరబండరాజు పాటలు ఊరూరా ప్రతిధ్వనించినయి.



# చలో ధూం ధాం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలన్నీ సీమాంధ్రకు తరలిపోతుంటే తెలంగాణలో ఆధిపత్యంపై ధిక్కార అలలు ఎగిసిపడుతున్నయి. సమస్త రంగాల్లో సీమాంధ్రుల ఆధిపత్యం నడుస్తున్న కాలంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల వెంకటరామారావు రాసిన 'కదనాన శత్రువుల కుత్తుకల నవలీల'' పాట తెలంగాణ ఆత్మగౌరవాన్ని పతాక స్థాయిలో నిలబెట్టింది. ఇదే కోవలో డా॥ఎస్వీ సత్యనారాయణ ''ఇది నా తెలంగాణ సంజీవ దీవిరా / ఇది నా తెలంగాణ పుణ్యాల దేవిరా'' అంటూ ఈ నేల స్వభావాన్ని వైభవోపేతంగా మలిచిండు. ఈ ఆత్మగౌరవం, తెగువ తెలంగాణ యువతలో నూతనోత్తేజాన్ని రగిలించాయి. ఆ ఉత్తేజం ఉద్యమమై స్వరాష్ట్ర సాధన కదనంలో కదం తొక్కింది. మేర మల్లేశం, అనుముల శ్రీహరి మొదలైన వాళ్లెందరో ఆనాటి ఉద్యమానికి పాటలు, కవిత్వాన్ని ఆయుధాలుగా అందించే ప్రయత్నాలు చేసింద్రు. ''ఇందిరమ్మ ఎందుకు? / ఇల్లలికేటందుకు!'' వంటి నినాదాలతో తీవ్ర నిరసనల హోరెత్తించింద్రు. పల్లెల్ని పాటలు ప్రభావితం చేసినయి. ఏదో ఓ రూపంలో ప్రభుత్వాల మీద తిరగబడేటట్టు చేసినయి. ఉద్యమం రక్తసిక్తమైంది. ఎందరో బిడ్డలు తెలంగాణ తల్లి విముక్తి కోసం నెత్తురు ధారపోసినా రాజకీయ నేతల ద్రోహంతో చల్లారిపోయింది. తెలంగాణ ఉద్యమం నిద్రాణస్థితిలోకి జారిపోయింది. రాజకీయ పార్టీలు తెలంగాణ నినాదాన్ని వదిలేసినా, ఉద్యమం ఆగిపోయినా కవులు, గాయకులు తెలంగాణ అస్తిత్వాన్ని చాటుతూనే వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని నీరుగార్చిన చెన్నారెడ్డికి నిరసనగా ముచ్చర్ల సత్యనారాయణ ఎన్నో వ్యంగ్య పదాలను కుప్పబోసిండు. ''రావోయి రావోయి మర్రి చెన్నారెడ్డి / ఇగనైన రావేమి వెర్రి చెన్నారెడ్డి'' అంటూ ఉద్యమం నీరుగార్చిన తీరు చెప్పుకొచ్చి తెలంగాణ ఆకాంక్షను కాపాడే ప్రయత్నం చేసిండు.

> **కదనాన శత్రువుల కుత్తుకల నవలీల**
> **నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి**
> **ధీరులకు మొగసాలరా!**
> **తెలగాణ వీరులకు కాణాచిరా!**
>
> పాట: కదనాన శత్రువుల
> రచన: రావెళ్ల వెంకట రామారావు

## పల్లె పల్లెన పల్లేర్లు మొలిసే

తెలంగాణ భాష, యాస, బతుకు, మెతుకు మీద సీమాంధ్ర ప్రాంత పాలకుల తీరు మారింది. వివక్ష పెరిగింది. 'తెలంగాణ' పదమే నిషేధమైంది. కరువు, నిరుద్యోగం, దోపిడీ తెలంగాణ యువతను నక్సలిజం వైపు నడిపించినయి. నిత్య నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు, హత్యలతో తెలంగాణ అల్లకల్లోలమైంది. అట్లున్న తెలంగాణలో.. 90వ దశకంలో అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకున్నయి. సాహిత్యంలో మార్పులొచ్చినయి. ప్రపంచీకరణలో కార్పొరేట్ దోపిడీలో వాటాలు కుదిరిన సీమాంధ్ర పెత్తందారులకు తెలంగాణ పెద్ద వనరు అయింది. నీళ్లు, నిధులు దోచుకున్న సీమాంధ్ర పాలకుల చేతుల్లోకి విలువైన భూమి

## బడికిపోయే

వయసులోనే పాటలు పాడుతున్న రసమయి బాలకిషన్ ఉత్తగనే మైక్ అందుకొని ఏ జంకు గొంకు లేకుండ ''చంద్రశేఖరన్న వచ్చె ఎన్నెలో ఎన్నెలా'' అంటూ తోచిన పదాలతో అల్లిన పాటను అలవోకగా పాడుతుంటె కేసీఆర్‌కి ముచ్చటనిపించింది. బాలకిషన్‌ని కేసీఆర్ తన వెంట తిప్పుకొన్నడు. అట్ల మొదలైన రసమయి బాలకిషన్ అనేకమంది ప్రజాకవుల పాటల్ని 'తెలంగాణ ధూం ధాం' వేదికల మీద గంటలకొద్ది పాడుతూ, ఎగురుతూ, దునుకుతూ మాటల మాంత్రికుడై, పాటల విలుకాడై సభలను అలరించిండు. ధూంధాం వేదికల మీద అంతడుపుల నాగరాజు బృందంతో కలిసి బాలకిషన్ తెలంగాణ ఉద్యమ పాటల్ని ఉద్రూతలూగించిన తీరు తెలంగాణ ఎప్పటికీ మరిచిపోదు. రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, విమలక్క పాటలు అంతడుపుల నాగరాజు బృందాల ప్రదర్శనలతో తెలంగాణ ఉద్యమం 'ధూం ధాం'గా నడిచింది. ''చలో ధూంధాం/ చలో ధూంధాం తెలంగాణ జాతరొచ్చెరా'' అంటూ విమలక్క బృందం ఆటపాటలతోని తెలంగాణ ఉద్యమాన్ని జాతరని తలిపించేట్టు చేసింది. కోదారి శ్రీనివాస్ రాసిన ''అస్సోంయ్ దులా హారతి కాళ్ల గజ్జెల గమ్మతి/ తెలంగాణ లడాయికి కదులుతున్న ఇమ్మతి'' రసమయి ఆటపాటతో జనాన్ని ఊద్రూతలూగించింది. ఈ పాట లేకుండా తెలంగాణ ధూంధాం సాగలేదంటే అతిశయోక్తి కాదేమో!